క్లుప్తంగా

నేడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభం

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని లాలుగారి బజార్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను గురువారం ప్రారంభించనున్నారు. రూ.80 లక్షల నిధులతో నిర్మించిన ఈ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి గురువారం ప్రారంభిస్తారని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ బుధవారం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


అశోక్‌కుమార్ మృతదేహం

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని అనారోగ్యంతో ఉన్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జూలకల్లు గ్రామం సమీపంలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ పఠాన్ రబ్బాని ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన జొన్నలగడ్డ అశోక్‌కుమార్(37)కు అనారోగ్య కారణాలతో ఇంటి నుంచి వెళుతూ తిరిగి రెండో రోజులకు వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలోనే అతను ఈ నెల 17న ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు రాత్రి ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు వస్తాడులే అని తల్లిదండ్రులు భావించారు. మండలంలోని జూలకల్లు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొనడంతో అశోక్‌కుమార్ తీవ్రగాయాలతో మృతిచెందాడు. ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడు పిడుగురాళ్ల వాసిగా గుర్తించారు. తండ్రి జొన్నల్లగడ్డ ఐజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

కండ్లకుంటలో రైతు ఆత్మహత్య


అయ్యన్న(ఫైల్)

వెల్దుర్తి: అప్పుల బాధతో మనస్థాపం చెందిన ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కండ్లకుంట గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ నర్రావుల అయ్యన్న(55) సొంత పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీప పొలం రైతులు గమనించి అయ్యన్నను హుటాహుటినా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. అయ్యన్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. పంటలు సరిగ్గా పండకపోవటంతో రూ.12 లక్షల అప్పులపాలయ్యాడు. దీంతో కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అయ్యన్న భార్య యశోద ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాడు. ఇతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాచర్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పిన్నెల్లి వెంట జిల్లా కార్యదర్శులు జూలకంటి వీరారెడ్డి, శ్రీనివాసశర్మ, నాసరరెడ్డి, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి, లింగారెడ్డి, తేజ తదితరులున్నారు.

108 సేవలపై అవగాహన

పిడుగురాళ్ల: ప్రమాదాల్లో ఉన్న వారికి ప్రభుత్వం అందిస్తున్న 108 సేవలతో ఎన్నో ప్రాణాలు నిలుస్తున్నాయని ఎన్‌సీసీ కమాండెట్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధూ తెలిపారు. పట్టణ సమీపంలోని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం ఎన్‌సీసీ 7వ వార్షిక శిక్షణా శిబిరం 5వ రోజు సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న వ్యక్తికి సీపీఆర్ ఏవిధంగా అందించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధికి నైపుణ్యాలు వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వాలీబాల్, త్రో బాల్ క్రీడలను నిర్వహించారు. ఎస్‌ఎం విజయ్ మోహితే పాల్గొన్నారు.

మంచినీటి చెరువులు నింపేందుకు చర్యలు

చిలకలూరిపేట: మంచినీటి చెరువులు నింపేందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణానికి తాగు నీరు సరఫరా చేసే మంచినీటి చెరువులకు సాగర్ జలాలు చేరుతున్న నేపథ్యంలో బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సాగర్ జలాలు నింపేందుకు మోటార్లు ఏర్పాటు చేసి చెరువులోకి నీటిని తోడుతున్నట్లు వెల్లడించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైతే అదనంగా మోటార్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువులను సమృద్ధిగా నింపాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన


ఒప్పిచర్ల వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, వైద్యులు, వైద్య సిబ్బంది


పిడుగురాళ్లలో చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మణికంఠ



గంగవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- గ్రామాల్లోనే వైద్య సేవలందిస్తున్న సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కారెంపూడి: మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామ సచివాలయం - 1 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో 912 మంది వైద్య సేవలు పొందారు. రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు కె.శ్రావణి, డి.నాగేంద్రబాబు, బి.దుర్గారావు, బి.వి జయానాయక్, ఎం.రమ్య శిబిరంలో వైద్య సేవలందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల లాజర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీటీసీ అనంతరామయ్య, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య పాల్గొన్నారు. శిబిరం నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్, వివిధ హోదాల వైద్య అధికారులు సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లు సేవలందించారు.

పిడుగురాళ్ల: జగనన్న ఆరోగ్య రక్ష ప్రజలకు శ్రీరామ రక్షగా ఉందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని లెనిన్‌నగర్ యూపీహెచ్‌సీలో బుధవారం జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమం ప్రజలు ఉపయోగించుకుంటున్నారన్నారు. పట్టణంలో ముందుగానే సర్వే నిర్వహించి, వార్డుల్లో అనారోగ్యంతో ఉన్న ప్రజల వివరాలను నమోదు చేస్తున్నామని చెప్పారు. జగనన్న ఆరోగ్య రక్ష మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. వైద్యశిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ కోసం సిఫార్సులు చేస్తున్నారు. అవసరమైన వారికి వైద్యశిబిరం వద్దే ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో వైద్యులు బి.మణికంఠ, పి.అనిల్ కుమార్, ఆర్.అశోక్ కుమార్, వై.వంశీమోహన్, ఏఎన్‌ఎంలు, సచివాలయ వైద్య సిబ్బంది, మహిళా పోలీస్‌లు, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవర రెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, షేక్ సైదావలి, మార్కెట్ యార్డు డైరెక్టర్ కృష్ణ, నాయకులు షేక్ జానీబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఒప్పిచర్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

జూలకల్లులో 508 మందికి వైద్య సేవలు

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. శిబిరంలో 508 మందికి డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, బీపీ, సుగర్, జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, వెంకటేష్, నాగిరెడ్డి, రమాదేవి, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

గురజాల: జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేదల పాలిట వరమని కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. శిబిరంలో 432 మంది వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చలవాది నారాయణ, చిలకపాటి బ్రహ్మయ్య, పూజల చంటి, బ్రహ్మేశ్వరరావు తదితరులున్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

మాచవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీవో యు.వరప్రసాద్ అన్నారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని చెప్పారు. మెడికల్ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. వైద్య శిబిరంలో 367 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ఎస్.చక్రవర్తి, డాక్టర్ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండ్ల మంగమ్మ రామకోటయ్య, ఎంపీటీసీ సఫావత్ లక్ష్మి శ్రీనునాయక్, యార్డు డైరెక్టర్ వీర్ల కాశమ్మ సుబ్బారావు, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ వట్టి రామిరెడ్డి, గ్రామ పెద్దలు బాలు నాయక్, శ్రీను, ఈఓపీఆర్డీ వెంగళరావు, వైద్యులు అన్వేష్, చంద్రహాసిత, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలి


సర్వసభ్య సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి


రెంటచింతల: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యార్ల మహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమీక్షా సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. నివాస పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలను నివారించవచ్చని, దీంతో విషజ్వరాలైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని గ్రామస్తులలో చైతన్యం తీసుకురావాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు సమష్టిగా క్షేత్రస్థాయిలో వీధిదీపాలు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని చెప్పారు. మలేరియా హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తల సేవలు వైద్య సేవలు అందించడానికి గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రరెడ్డి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు వెంకయ్య, సుబ్బారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దసరా మహోత్సవాలు


లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో..


సత్రశాల దేవస్థానంలో సంతానలక్ష్మి దేవిగా..


వాసవీ అమ్మవారి దేవస్థానంలో ధనలక్ష్మి దేవిగా..


పిడుగురాళ్ల పట్టణంలో మహాలక్ష్మి దేవిగా వాసవీ మాత


గురజాలలో అన్నపూర్ణాదేవిగా..

పిడుగురాళ్ల: గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం అమ్మ వార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అమ్మవారు మహాలక్ష్మిగా, భవానీనగర్‌లోని కనకదుర్గా అమ్మవారు శ్రీ మహాలక్ష్మిగా, పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడిలోని అమ్మవారు ప్రత్యేక అలంకరణలో, బ్రహ్మంగారి గుడిలోని అమ్మవారు విశేష అలంకరణలో, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అమ్మవారు కుర్మావతారంలో, పలు దేవాలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని మాయాబజార్‌లో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం సమీపంలో భక్తులు బుధవారం కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనం

గురజాల: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో, శ్రీ పాతపాటేశ్వర అమ్మవారి దేవాలయంలో, లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో పలు ఏరియాల్లో అమ్మవార్లు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోతమిషన్ సెంటర్, దివ్యాంగుల కాలనీల్లో బతుకమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

విజయపురిసౌత్: స్థానిక మెయిన్‌బజార్‌లోని కనకదుర్గా అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే సామూహికంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకం, సహస్రనామ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే సి టైపులోని అమ్మవారి విగ్రహం వద్ద సాయి ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కనకదుర్గా వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, భవానీయూత్ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీమహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ


నాగుల గుడిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ప్రతేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

రెంటచింతలలో..

రెంటచింతల: సత్రశాల వద్ద వేం చేసి ఉన్న అతి పురాతన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో అమ్మవారు సంతానలక్ష్మి దేవి అలంకారంలో భక్తులచే పూజలు అందుకున్నారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమించారు. పాలువాయిజంక్షన్ వద్ద త్రిశక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దుర్గాదేవి సంతానలక్ష్మీ దేవి అలంకారంలో, లక్ష్మీదేవి గజలక్ష్మీ దేవి అలంకారంలో, సరస్వతి దేవి రాజమాతంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలువాయిజంక్షన్‌లో భక్తిశ్రద్ధలతో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన బతకమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్రశాల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఆయా దేవస్థానాల అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, యేచూరి సాంబశివరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- గుత్తికొండలో గడప గడపకు మన ప్రభుత్వం


గుత్తికొండలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో అభివృద్ధి, సంక్షేమంతో వెలుగులు నిండాయని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలోని సచివాలయం 1 పరిధిలోని ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి మహిళలు హారతులతో, పూల వర్షంతో బ్రహ్మరథం పెట్టారు. గత నాలుగున్నర ఏళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. వృద్ధులు, అక్క చెల్లెమ్మలు, యువత చిన్నారులను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

పేదల అభివృద్ధే ధ్యేయం..

పేదల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే రాకతో ఎస్టీ కాలనీలోని ప్రజలు సంతోషంతో వారి సమస్యలను తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీలోని పలు రోడ్లను సీసీ రోడ్లును నిర్మించేందుకు నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. రోడ్లు నిర్మించేందుకు అంచనాలను సిద్ధం చేయమని అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రతి కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం పాటు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ వాలునాయక్, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు నల్లబోలు రామారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తాటికొండ చిన ఆంజనేయలు రెడ్డి, ఎంపీటీసీలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, గ్రామ కన్వీనర్ సత్యానారాయణ, నాయకులు బండ్ల రామారావు, రామ కోటేశ్వరరావు, కావూరి రామాంజనేయులు, సాంబశివరావు, మాజీ సర్పంచ్ కుంభా అచ్చయ్య, దావీదు, కోఆప్షన్ మెంబర్ మస్తాన్‌వలి, మేడుకొండ పిచ్చిరెడ్డి, నల్లబోలు శివకృష్ణ, యలమందా, తోట చిన్నోడు, కొత్త రమేష్, ముత్యాల నాయక్, వేగు నాయక్, బాలజీ నాయక్, ఆంజనేయలు నాయక్, మేకు నాయక్, పార్టీ కార్యర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పిడుగురాళ్ల: పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి తెలిపారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో పౌష్టికాహారం సద్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ కిట్ అందజేస్తోందన్నారు. కిట్‌లో రెండు కిలోల రాగి పిండి, ఒక కిలో అటుకులు, పావు కేజీ ఖర్జూర, పావు కేజీ పల్లి చెక్క, పావు కేజీ బెల్లం, 3 కేజీల బియ్యం, ఒక కిలో కందిపప్పు, అర లీటర్ నూనె, 5 లీటర్ల పాలు, 25 గుడ్లు ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. గర్భిణులు తమకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరగా జన్మించేందుకు ఇటువంటి పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే 7 నెలల చిన్నారుల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బాలామృతం పౌష్టికాహారం, 25 గుడ్లు అందిస్తోందని, తల్లులు తమ పిల్లలకు తప్పని సరిగా ఈ బాలామృతం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి

భూముల రీ సర్వేతో అన్నదాతలకు ఎంతో మేలు

రెంటాల(రెంటచింతల): రాష్ట్రంలో భూ వివాదాలను, సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భూ రీసర్వే వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రెంటాల గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే భూములను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట సుధాకర్, నాయకులు పేరం పెద సీతారామిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, గాలిరెడ్డి, గ్రామ వీఆర్వోలు నాసరయ్య, విగ్నేష్, టి.లింగయ్య, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కారెంపూడిలో ప్రారంభమైన రీ సర్వే

కారెంపూడి: కారెంపూడి గ్రామంలో జగనన్న భూ హక్కు భూ సురక్ష కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ భూముల రీ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. రెండు టీమ్‌లు రెండు రోవర్ల సాయంతో సర్వే చేపట్టారు. దాచేపల్లి రోడ్డు ప్రాంతంలో ఒక టీమ్, సాగర్‌కుడి కాల్వ దక్షిణం వైపు మరో టీమ్ సర్వే చేశారు. సెక్షన్ 21 ప్రకారం ముందుగా నోటీసులిచ్చి రైతుల సమక్షంలో భూములను రీ సర్వే చేస్తున్నారు. రీ సర్వే రిపోర్టును సంబంధిత రైతులకు తెలియపరుస్తామని మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్ తెలిపారు. సర్వే పనులను కారెంపూడి వీఆర్వో కృష్ణప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.


రెంటాలలో రీ సర్వే పనులను ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి, అధికారులు


సర్వే పనులను పరిశీలిస్తున్న మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్